అపరాల కొనుగోలుకు నమోదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రబీ సీజన్‌లో సాగు చేసిన అపరాల కొనుగోలుకు నమోదు ప్రక్రియను ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాఫెడ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యాన కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. క్వింటా మినుములు రూ.7,400, క్వింటా పెసలు రూ.8,682గా మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. అపరాలు సాగు చేసి ఈ-క్రాప్, ఇకెవైసి చేయించుకున్న రైతులు తమ ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయించుటకు గానూ రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. తమ పంటను విక్రయించదలచిన రైతులు తప్పనిసరిగా నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పంటను శుభ్రపరచి, జల్లెడ పట్టి సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి జపం... కదలని ప్రగతి రథం

- టిడిపి అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ కొత్త విజన్లు
- ఒక్క సాగునీటి ప్రాజెక్టూ పూర్తి కాని వైనం
- పదేళ్లుగా తలసరి ఆదాయంలో అట్టడుగు స్థానమే
- ప్రత్యామ్నాయాలు విస్మరించి పాత పాటే పాడుతున్న ప్రభుత్వం

అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి జపం చేస్తూనే ఉన్నారు. రాష్ట్ర విభజన తర్వాత లెక్కలు తీసుకున్నా సిక్కోలు ప్రగతి రథం ఒక్క అడుగు ముందుకు పడలేదు. ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన వంశధార స్టేజ్-2 ఫేజ్-2, ఆఫ్‌షోర్ రిజర్వాయర్, వంశధార-నాగావళి నదుల అనుసంధానం పనులు పూర్తి కాలేదు. పదేళ్లలో జిల్లాకు కొత్తగా ఒక్క పరిశ్రమా రాలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా పగ్గాలు చేపట్టిన ప్రతిసారీ విజన్, యాక్షన్ ప్లాన్ అంటూ హడావుడి తప్ప అభివృద్ధిలో మాత్రం అడుగు ముందుకు పడడం లేదు. జిల్లా అభివృద్ధికి ప్రత్యామ్నాయాలను పరిశీలించి అమలు చేయకుండా, ప్రజల తలసరి ఆదాయం తగ్గిపోయిందంటూ అమరావతిలో ఈనెల 24, 25 తేదీల్లో కలెక్టర్ల సదస్సులో సిఎం ఆవేదన వ్యక్తం చేయడం కొసమెరుపు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వ్యవసాయం, అనుబంధ రంగాల ద్వారా ప్రస్తుతం రూ.11,606 కోట్ల జిడిడిపి వస్తుండగా 2028-29 నాటికి రూ.13,399 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రం విడిపోయిన తర్వాత జిల్లాలో ఎటువంటి వ్యవసాయం, సాగు పరిస్థితులు ఉన్నాయో ఈ పదేళ్లలోనూ అవే పరిస్థితులు ఉన్నట్లు అందులో పొందుపరిచింది. తక్కువ ఉత్పాదకత, ఒకే ఒక్క పంట కారణంగా చిన్న, సన్నకారు రైతులు చాలా పేదరికలో ఉన్నా... నీటి నిర్వహణలో అధ్వాన పరిస్థితి, పంటలు పండిన తర్వాత నష్టాలు, మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం తదితర అంశాలు వ్యవసాయంలో వెనుకబాటు కారణాలు కాగా, వాటిని పరిష్కరించే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన వంశధార, ఆఫ్‌షోర్, వంశధార-నాగావళి నదుల అనుసంధానం, తోటపల్లి పాత రెగ్యులేటరీ ఆధునీకరణ తదితర సాగునీటి ప్రాజెక్టులు ఎప్పుడు పూర్తవుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ప్రతి బడ్జెట్‌లో అరకొరగా నిధులు కేటాయిస్తోంది. ఈ ఏడాది బడ్జెట్‌లో వంశధార ప్రాజెక్టు స్టేజ్-2, ఫేజ్-2కు సంబంధించి 87, 88 ప్యాకేజీ పనులు, హిరమండలం రిజర్వాయర్, వంశధార-నాగావళి నదుల అనుసంధాన పనుల కోసం మొత్తం రూ.191.32 కోట్లు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. బడ్జెట్‌లో రూ.182.53 కోట్లను కేటాయించింది. ఆఫ్‌షోర్ పనుల కోసం రూ.167.68 కోట్లు అవసరమని ప్రతిపాదించగా, ప్రభుత్వం మాత్రం రూ.90.60 కోట్లను కేటాయించింది.

పదేళ్లయినా పారిశ్రామిక రంగం నిరాశాజనకం

జిల్లాలో పారిశ్రామిక రంగం ద్వారా 2024-25లో రూ.7,368 కోట్ల ఆదాయం సమకూరింది. 2025-26 నాటికి రూ.8,594 కోట్లకు పెంచతామని చెప్తోంది. నైపుణ్యం గల కార్మికుల వలస, పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా కార్మికులను అందించలేకపోవడం అడ్డంకులుగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించినా, వాటి పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకుంటుందో ప్రభుత్వం చెప్పడం లేదు. జిల్లాలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఏర్పాటు కానున్న పరిశ్రమలపై ప్రభుత్వం ఎటువంటి ప్రణాళికలు ఉన్నట్లు కనిపించడం లేదు.

ఆర్థికాభివృద్ధికి దోహదపడే అంశాలు విస్మరణ

భావనపాడు, కళింగపట్నం ఓడరేవులను అభివృద్ధి చేయడం ద్వారా మత్స్యకారులకు ప్రయోజనం కలగడంతో పాటు జిల్లా అభివృద్ధికి, ఉపాధి అవకాశాలు పెరగడానికి దోహదపడుతుంది. ఓడరేవుల నిర్మాణం, కోల్ట్‌స్టోరేజీలను నిర్మించి మత్స్యకారులకు మరిన్ని మరబోట్లను అందించగలిగితే ఆదాయం రెండు, మూడు రెట్లు పెరిగి వారి జీవితాలు మెరుగుపడే అవకాశమున్నా, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ప్రతిపాదిత ఫిషింగ్ హార్బర్, వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో జెట్టీ నిర్మాణాలు ఐదేళ్లవుతున్నా ప్రారంభ దశలోనే ఉన్నాయి. వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి వలసలు తగ్గుతాయి. ఆమదాలవలస చక్కెర పరిశ్రమను సహకార రంగంలో తెరిపిస్తే పది వేల మంది వరకు ఉపాధి అవకాశాలు, ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. దీంతోపాటు ముడిసరుకు, విద్యుత్ ఛార్జీల భారంతో మూతపడుతున్న జ్యూట్ పరిశ్రమలను తెరిపించడంపై ప్రభుత్వం దృష్టిసారించాల్సి ఉంది.

పంటలకు గిట్టుబాటు ధరపై ఏవీ ప్రణాళికలు

జిల్లాలో ఏటా రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తున్న పరిస్థితి లేదు. ఈ ఏడాది ఏడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌లోకి వస్తే, ప్రభుత్వం 5.10 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేసింది. దళారులకు ధాన్యం అమ్ముకోవడంతో రైతులు ఆదాయం కోల్పోతున్నారు. జీడి పంటకు 80 కేజీల బస్తాకు వ్యాపారులు రూ.10 వేలు చెల్లిస్తున్నారు. ప్రభుత్వమే కొనుగోలు చేసి రూ.16 వేలు ఇస్తే వారి ఆదాయం మెరుగుపడుతుంది. అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం, గిట్టుబాటు ధర కల్పించకపోవడం, జిల్లాలో జిసిసి లేకపోవడంతో గిరిజనులూ వారి ఆదాయాన్ని కోల్పోతున్నారు. అన్ని తరగతులూ ఆదాయం కోల్పోతుండడంతో వారి తలసరి ఆదాయం పడిపోతోంది. అన్ని రకాల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధర దక్కేలా ప్రణాళికలు అమలు చేయకుండా తలసరి ఆదాయం ఎందుకు తగ్గిపోతుందంటూ పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలదీస్తే అమాత్యుల దగ్గర మాత్రం ఏం సమాధానం ఉంటుంది? ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లా అభివృద్ధికి గల ప్రత్యామ్నాయాలు పరిశీలించి అమలు చేయాలి. అప్పుడే ప్రగతి సాధ్యపడుతుంది.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

లేఆఫ్ ప్రతిపాదనను రద్దు చేయాలి

29న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రణస్థలం మండలంలోని శ్యామ్‌పిస్టన్స్ పరిశ్రమలో కార్మికుల లే ఆఫ్ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, కార్మికుల ఉపాధి కాపాడాలని కోరుతూ మార్చి 29న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని శ్యామ్‌క్రగ్ పిస్టన్స్(రింగ్స్) ప్లాంట్-2 పరిశ్రమలో 200మంది కార్మికులను లే ఆఫ్ చేయకుండా యాజమాన్యాన్ని ఆదేశించాలని, బలవంతపు రిటైర్మెంట్ ఆపాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అధ్యక్షతన నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్యామ్‌పిస్టన్స్ యాజమాన్యం 200 మంది కార్మికులను లే ఆఫ్ చేయడం కోసం ప్రభుత్వ అనుమతికి దరఖాస్తు చేసిందని తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పనిలో నుంచి తీసివేస్తారని కార్మికులు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ విధమైన లేఆఫ్‌లూ చేయొద్దని యాజమాన్యాన్ని ప్రభుత్వం ఆదేశించాలని కోరారు. వేతన ఒప్పందం ప్రకారం ఐదేళ్లుగా బోనస్ చెల్లించడం లేదని, గత అక్టోబరులో చెల్లించాల్సిన బోనస్ నేటికీ చెల్లించలేదని తెలిపారు. యాజమాన్యం వారు 30 ఏళ్ల సర్వీసు పూర్తయిందని కార్మికులను బలవంతంగా రిటైర్మెంట్ చేస్తున్నారని, ఇప్పటివరకు అక్రమంగా 120 మంది కార్మికులను బలవంతపు రిటైర్మెంట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఇదే జీవనాధారంగా ఉన్న కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. బలవంతపు రిటైర్మెంట్ నిలుపుదల చేసి, అక్రమంగా నిలుపుదల చేసిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు ఇస్తామన్న హెల్త్ కార్డులు ఇవ్వలేదని, చనిపోయిన కార్మిక కుటుంబాలకు చెల్లించాల్సిన చెల్లింపులు చెల్లించలేదని చెప్పారు. ఆరేళ్లుగా వేతన ఒప్పందం చేయలేదని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా 200 మంది కార్మికులను రోడ్డున పెట్టడానికి యాజమాన్యం సిద్ధమైందన్నారు. ప్రభుత్వానికి లే ఆఫ్ కోరడానికి అవసరమైన లాభనష్టాలకు సంబంధించినవి గానీ ఎబిసి వంటి ఎటువంటి రికార్డులు కూడా ఇవ్వలేదన్నారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయడమే కాకుండా ఉన్న పరిశ్రమల్లో కార్మికుల ఉపాధి పోకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్నారు. కార్మికుల ఉపాధి పోకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసు, వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకులు ఎస్.వెంకటరావు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి, శ్యాంపిస్టన్స్ ప్లాంట్-3 వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్.వి రమణ, నాగార్జున అగ్రికమ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు, నాగార్జున అగ్రికమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.రామప్పుడు, ఎమ్.రమణ, కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు పి.చంద్రశేఖర్ పలు సంఘాల నాయకులు మాట్లాడి మద్దతు ప్రకటించారు.

ముగిసిన ఎపిపిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి - నరసన్నపేట

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిప్యూటీ డిఇఒ పోస్టుల నియామకానికి గురువారం నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు నరసన్నపేట కోర్ టెక్నాలజీస్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహణ విధానాన్ని పర్యవేక్షించారు. పరీక్షకు 92 శాతం మంది హాజరయ్యారు. పరీక్షలను సజావుగా పూర్తి చేసినట్లు డిఆర్‌ఒ తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు

అధిక మోతాదులో ఎరువుల వాడకంతో నష్టం

వ్యవసాయశాఖ జెడి కె.త్రినాథస్వామి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో రైతులు అధిక మోతాదులో రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడుతున్నారని, దీనివల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వ్యవసాయ శాఖ జాయింట్ కలెక్టర్ డైరెక్టర్ కె.త్రినాథస్వామి అన్నారు. శ్రీకాకుళంలోని రైతు శిక్షణా కేంద్రంలో వ్యవసాయ వర్తకులకు వ్యవసాయ విస్తరణ సేవ, ఉత్పాదకత, వర్తకులకు సేవాయోగ్యతపై శిక్షణా తరగతులను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో ఎరువులు, పురుగు మందులు అధిక మోతాదులో వాడకం వల్ల పర్యావరణానికి హాని కలిగిస్తోందన్నారు. వీటి వాడకాన్ని తగ్గించుకునేందుకు రైతులకు వీటి గురించి అవగాహన కల్పించడంలో ఉత్పాదక వర్తకులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. డిప్లమా కోర్సులో నాలుగేళ్ల వ్యవసాయ డిగ్రీ కోర్సులో బోధించే పాఠ్యాంశాలను ఏడాది డిప్లమో కోర్సులో బోధిస్తారని, అందువల్ల ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, నైర వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డి.చిన్నం నాయుడు, రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త పి.ఉదయ్‌బాబు, ఆమదాలవలస వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ జి.చిట్టిబాబు, కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డా.కె.భాగ్యలక్ష్మి, వ్యవసాయ శాఖ ఎడిఎ టి.భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జెడి త్రినాథస్వామి

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇవిఎం గోదాములను గురువారం తనిఖీ చేశారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్‌లోని గోదాముల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇవిఎంల భద్రతాపరంగా ఎలాంటి లోపాల్లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి మూడు నెలలకోసారి ఇవిఎం గోదాముల తనిఖీ చేపడుతున్నట్లు తెలిపారు. ఇవిఎంలను ట్రిపుల్ లాక్ సిస్టమ్ ద్వారా భద్రపరిచామన్నారు. గోదాముల వద్ద 24 గంటల సిసి కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఇవిఎంల భద్రతను పటిష్టంగా ఉంచడానికి అధికారులు తీసుకున్న చర్యలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన, వైసిపి, సిపిఎం, కాంగ్రెస్ తదితర పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బలసలరేవు వంతెన ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి - ఆమదాలవలస

నాగావళి నదిపై నిర్మించ తలపెట్టిన బలసలరేవు వంతెన నిర్మాణ ప్రాంతాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ గురువారం పరిశీలించారు. ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, ఆర్‌అండ్‌బి డిఇ గణపతిరావుతో కలిసి తొగరాం, కొత్తవలస పంచాయతీల పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ నాగావళి నదిపై బలసలరేవు వద్ద వంతెన నిర్మాణం జరిగితే అప్రోచ్ రోడ్డు నిర్మించాల్సి ఉంటుందని, అందుకవసరమైన భూసేకరణ, రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం అంశాలను పరిశీలించామన్నారు. రాగోలు నుంచి తొగరాం మీదుగా ఆమదాలవలసకు సుమారు రూ.మూడు కోట్లతో నిర్మించనున్న బిటి రహదారి ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.రాంబాబు ఆర్ అండ్ బి జెఇ శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వివరాలను సేకరిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ బాలమురళీకృష్ణ

సవాళ్లకు సిద్ధంగా ఉండాలి

శ్రీకాకుళం: ఆరోగ్యరంగంలో భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు వైద్యారోగ్యశాఖ సిబ్బంది సిద్ధంగా ఉండాలని, అందుకనుగుణంగా శిక్షణ పొందాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి టి.వి బాలమురళీకృష్ణ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో స్టాఫ్ నర్సులు, ఎఎన్ఎంలకు నిర్వహించిన మూడు రోజుల 'విస్తత అరోగ్య సేవల విస్తరణ కార్యక్రమం"లో గురువారం ఆయన మాట్లాడారు. ఓరల్ హెల్త్, కేన్సర్, మానసిక ఆరోగ్యం, స్త్రీ సంబంధిత సంబంధిత వ్యాధులు, వృద్ధాప్య సేవలు, మాతా శిశుసంరక్షణ తదితర వాటిలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఇటువంటి పున:శ్చరణ శిక్షణ వల్ల వృత్తి నైపుణ్యం మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిపిఎంఒలు డాక్టర్ రవీంద్ర, వాన సురేష్ కుమార్, మాస్టర్ ట్రైనీలు జి.వి లక్ష్మి, కృష్ణచైతన్య, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పల్లె పుష్కరిణితో చెరువుల అభివృద్ధి

కవిటి: పల్లెపుష్కరణి కార్యక్రమం ద్వారా చెరువులు అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అందులో భాగంగా కవిటి చింతామణి అమ్మవారి ఆలయ మార్గంలో ఉన్న కొత్త చెరువు, మరో చెరువు శీఘ్రగతిన అభివద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక నాయకులతో కలిసి కొత్తచెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లె పుష్కరిణిలో భాగంగా చెరువులో పూడికతీత, సుందరీకరణ చేసి ఒక ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పర్యాటక రంగం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం రూపొందించిన ఈ కార్యక్రమానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్ శివాజీపాణిగ్రాహి, ఇఒ వీరభద్రస్వామి, ఎపిఒ మోహనరావు, నాయకులు బెందాళం రమేష్, ఆరింగి మధు పాల్గొన్నారు.

కొత్తచెరువు పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

స్టీరింగ్ కమిటీతో డిఆర్‌ఒ చర్చలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

14 మంది ఉపాధ్యాయుల సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాలు చేపడుతున్న ఆందోళనతో జిల్లా అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. అందులో భాగంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక స్టీరింగ్ కమిటీ ప్రతినిధులతో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఎఒ ఎం.సూర్యనారాయణ కలెక్టరేట్‌లో గురువారం చర్చలు జరిపారు. ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుల సస్పెన్షన్, మాస్ కాపీయింగ్ ఉదంతంపై స్టీరింగ్ కమిటీ సభ్యులు చౌదరి రవీంద్ర, ఎస్.కిషోర్ కుమార్, తంగి మురళీమోహన్, మజ్జి మదన్‌మోహన్ తదితరులు పూర్వాపరాలను వివరించారు. జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య ఉద్దేశపూర్వకంగానే సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసులు పెట్టించారని తెలిపారు. ఆయన్ను డిఇఒగా విధుల నుంచి తప్పించాలని, డైట్, డిఇఒ కార్యాలయాల్లో ఆయన అవినీతిపై విచారణ చేయించాలని కోరారు. బాధిత ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేసి, క్రిమినల్ కేసులను ఉపసంహరించుకోవాలన్నారు. విద్యార్థులకు వాటిల్లిన నష్టాన్ని పూడ్చడానికి పరీక్ష నిర్వహించాలని, లేకుంటే సప్లిమెంటరీ పరీక్షకు వారిని అనుమతించాలని కోరారు. ఉన్నతాధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని డిఆర్‌ఒ హామీనిచ్చారు.

వినతిపత్రాన్ని అందజేస్తున్న స్టీరింగ్ కమిటీ సభ్యులు

విద్యా వ్యవస్థ బలోపేతానికే 117 జిఒ రద్దు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

గార: విద్యా వ్యవస్థ బలోపేతానికే రాష్ట్ర ప్రభుత్వం 117 జిఒను రద్దు చేసిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గడిచిన ఐదేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. అందులో భాగంగానే 117 జిఒ తీసుకొచ్చి అనేక పాఠశాలలను మూసివేసిందన్నారు. ప్రభుత్వ విద్యారంగానికి చేటు చేసే ఈ జిఒను టిడిపి కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని చెప్పారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు నాలుగు రకాలుగా విద్యా విధానాన్ని అమలు చేస్తోందన్నారు. ఫౌండేషన్ కోర్సు, బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ, హైస్కూల్ విద్యా విధానాన్ని అమలు చేస్తూ విద్యా బోధన చేస్తోందన్నారు. ఈ తరహా విధానం వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. సమావేశంలో ఉప విద్యాశాఖాధికారి, విద్యా కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి క్రమశిక్షణా కమిటీలో రెడ్డి శాంతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వైసిపి క్రమశిక్షణా కమిటీలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి చోటు దక్కింది. ఈమేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి చైర్మన్‌గా ఐదుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. అందులో రెడ్డి శాంతికి సభ్యురాలిగా అవకాశం కల్పించింది. ఆమెతో పాటు సభ్యులుగా తానేటి వనిత, కె.అనిల్ కుమార్, వై.విశ్వేశ్వరెడ్డి ఉన్నారు.

రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

కంచిలి: గ్రామీణ రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని పెద్దశ్రీరాంపురం నుంచి మూడు గ్రామాలకు వెళ్లే లింకు రహదారుల నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నశ్రీరాంపురం నుంచి సాలిన పుట్టుగ వెళ్లే రహదారికి రూ.40 లక్షలు, పెద్దశ్రీరాంపురం బస్టాండ్ నుంచి పద్రిపుట్టుగ వెళ్లే రహదారికి రూ.36 లక్షలు, గ్రామంలోని శివాలయం నుంచి కత్తివరం ఆర్‌అండ్‌బి రహదారి వరకు రూ.91 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మాదిన రామారావు, మాదిన ప్రదీప్, పి.పూర్ణ, పిలక చిన్నబాబు, పురుషోత్తంరెడ్డి, ఎం.ఆనంద్, బి.కురయ్య తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న విప్ అశోక్

ప్రజాశక్తి
www.prajasakti.com

మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

నాటుసారా విక్రయిస్తే చర్యలు

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి- పలాస

గ్రామాల్లో నాటుసారా తయారు చేసి విక్రయించినా, రవాణా చేసినా చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని పెదంచలలో నవోదయం 2.0లో భాగంగా గురువారం ఎక్సైజ్ ఆధ్వర్యాన నాటుసారా నియంత్రణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా నాటుసారా తయారు చసినట్లు మీ దృష్టికొస్తే ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. నాటుసారా తాగడం వల్ల ఆరోగ్యం పూర్తిగా పాడవుతుందన్నారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి, ఎంపిడిఒ వసంత కుమార్, కాశీబుగ్గ ఎక్సైజ్ సిఐ మల్లికార్జునరావు, ఎస్ఐ షేక్ సైదాబి, సర్పంచ్ వరిశ రామారావు, వైస్ ఎంపిపి తలగాన శ్రీరాములు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యాసాగర్

కళలతో సమాజ ప్రగతి

ఆమదాలవలస : సమాజమే ఒక రంగస్థలం అని కళలతోనే సమాజ ప్రగతి సాధ్యమని టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. గురువారం పట్టణంలోని పాలపోలమ్మ తల్లి గుడి ఆవరణలో కళాకారుల సంఘ అధ్యక్షులు టేకి త్రినాథరావు అధ్యక్షతన ప్రపంచ కళాకారుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ కళలు అంతరించిపోతున్న తరుణంలో ప్రభుత్వాలు వాటి మనుగడకు కృషి చేయాలన్నారు. కళాకారుల సంక్షేమ సంఘం సహాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు మాట్లాడుతూ కళారంగాన్ని ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. అనంతరం సత్యహరిశ్చంద్ర పద్యాలను కళాకారులు ప్రదర్శించారు. బంకుపల్లి దుర్గాప్రసాద్ శర్మను కళాకారుల సంక్షేమ సంఘం తరపున సన్మానించారు. కార్యక్రమంలో కళాకారుల సంఘ గౌరవాధ్యక్షులు బంకుపల్లి శ్రీరామ చంద్రమూర్తి, కళాకారుల సంఘ కార్యదర్శి బగాది వెంకటరావు, టిడిపి మండల అధ్యక్షులు నూక రాజు, వైద్యులు పి.తాతయ్యలు, పారిశ్రామికవేత్త జె.జె.మోహనరావు, కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, కళాకారులు పాల్గొన్నారు.

నాటుసారా అరికట్టేందుకు చర్యలు

సోంపేట : గ్రామాల్లో నాటు సారాను పూర్తిగా అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ సిఐ కె.బేబీ తెలిపారు. మండలంలోని శారదాపురంలో గురువారం నవోదయం-2 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాటుసారా వల్ల కలిగే అనర్ధాలను గురించి ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్మల్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా పోరాడుదాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ధర్మల్ పవర్ ప్లాంట్ వలన మానవాళి మనుగడకే ప్రమాదమని, పర్యావరణానికి, పచ్చదనానికి ప్రమాదమని తక్షణమే ధర్మల్ ప్లాంట్ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించు కోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వెన్నెల వలస, మశానపుట్టి, జంగాలపాడులో ప్రజా సంఘాల నాయకులు పర్యటించారు. ఆదివాసీలు చేస్తున్న పోడు వ్యవసాయాన్ని, వెన్నెలవలస రిజర్వాయర్‌ను పరిశీలించారు. అనంతరం వెన్నెలవలసలో పోరాట కమిటీ నాయకుడు సవర సింహాచలం అధ్యక్షతన జరిగిన సభలో పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పి. దానేష్, కెఎన్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, పిడిఎం రాష్ట్ర నాయకులు పాలిన వీరాస్వామి, పికెఎస్ జిల్లా అధ్యక్షులు ధర్మారావు పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంతంలో ధర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి పనికిరాదని వెన్నెల వలస రిజర్వాయర్ నుంచి నీటిని తరలిస్తే పంటలకు సాగునీరు అందక దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ధర్మల్ పవర్ ప్లాంట్ పేరుతో రెండు వేల ఎకరాల భూమిని సేకరించి కాజేయాలన్న కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ప్రపంచ దేశాలు ధర్మల్ పవర్ ప్లాంట్‌కు ప్రత్యామ్నాయంగా సోలార్, జలవిద్యుత్ వంటి వాటి వైపు ఆలోచిస్తుంటే ఇటువంటి ధర్మల్ పవర్‌ప్లాంట్‌ను ప్రజల నెత్తిపై రుద్దడం సరికాదని అన్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ తన స్వప్రయోజనాల కోసం ఈ ప్రాంత విధ్వంసాన్ని కోరుకుంటున్నారని విమర్శించారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీల్లో రైతులు, కూలీలు, దళితులు, పీడిత వర్గాలు, పర్యావరణ ప్రేమికులు ధర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సోంపేట కాకరపల్లి వంటి ప్రాంతాల ప్రజలు ధర్మల్ పవర్ ప్లాంట్‌ను తరిమేస్తే ఈ ప్రాంతానికి ధర్మల్ ప్లాంట్ తీసుకువచ్చి ఆదివాసి రైతు, కూలీల జీవితాలను విధ్వంసం చేస్తున్నారని దీనికి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పికెఎస్ జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధన, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు వంకల మాధవరావు, సామాజిక న్యాయపోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాశి గణేష్, గంగయ్య, పోతనపల్లి వైకుంఠరావు, రామానాయుడు, మహిళా సంఘ నాయకులు నాగమణి, కోటి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ధర్మల్ పోరాట సంఘ నాయకులు

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

రోడ్ల నిర్మాణాలకు చర్యలు

ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- కొత్తూరు

గ్రామీణ ప్రాంత రోడ్ల నిర్మాణాలకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఉపాధి హామీ నిధులు రూ.2 కోట్లతో సిరుసువాడ పిహెచ్, లోతుగెడ్డ, కుంటిభద్ర వరకు తారు రోడ్డు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తాగునీటి కోసం నియోజకవర్గానికి రూ.265 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు దశరవారీగా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, తహశీల్దార్ కె.రవిచంద్ర, ఎంపిడిఒ వి.నీరజ, డిఇ శివప్రసాదరావు, ఎఇఇ దుర్గాప్రసాదరావు, ఎపిఒ బి.రాంబాబు, సర్పంచ్ వి.పోలినాయుడు, ఎంపిటిసి చెంగల దివ్య పాల్గొన్నారు.

నేడు బూర్జ మండల సమావేశం

ప్రజాశక్తి- బూర్జ

మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి కె.దీప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తిరుపతిరావు గురువారం తెలిపారు. మండలంలో అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుతో పాటు పూర్తిస్థాయి సమాచారంతో రావాలన్నారు. అలాగే సర్పంచ్‌లు, ఎంపిటిసిలు హాజరుకావాలని కోరారు.

'పది' పరీక్షల ముగింపుపై సందిగ్ధత

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17 నుంచి ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగింపుపై సందిగ్ధత నెలకుంది. విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు 17న ప్రారంభమైన పరీక్షలు రోజు తప్పించి రోజుకొకటి చొప్పున నిర్వహిస్తున్నారు. ఇంకా రెండు పరీక్షలు మాత్రమే ఉన్నారు. చివరి పరీక్ష అయిన సాంఘీకశాస్త్ర పరీక్ష నిర్వహణ తేదీ సందిగ్ధంలో పడింది. ముందుగా జారీ అయిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 31తో పరీక్షలు ముగుస్తాయని టైంటేబుల్‌లో పేర్కొన్నారు. అయితే అదేరోజు రంజాన్ పర్వదినం కావడంతో ప్రభుత్వ సెలవు ఉంటుంది. ఇటువంటి నేపథ్యంలో సోమవారం నాటి పరీక్ష మరుచటి రోజుకు వాయిదా పడాలి. రంజాన్ సోమవారం కాదు మంగళవారం ఆని ప్రకటిస్తే ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారంతో పరీక్షలు ముగించాలి. ముస్లిం పెద్దలు రంజాన్ పర్వదినం కోసం చేసే ప్రకటన మేరకు పరీక్షలు ముగింపు ఉంటాయి. ఇటువంటి సందిగ్ధత నేపథ్యంలో పరీక్షలు ముగింపు ఉండడంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయుల్లో సందేహాలు నెలకున్నాయి. దీనిపై ముస్లిం పెద్దలు, ప్రభుత్వ నిర్ణయం మేరకు పరీక్షలు ముగింపు ఆధారపడి ఉంటుంది.

డిఇఒను తొలగించి జిల్లా ప్రతిష్టను కాపాడాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గిరిధర్

పదో తరతగతి పరీక్షల్లో కుప్పిలి మోడల్ స్కూల్‌లో ఐఐటి సీట్ల కోసం మామ్మూళ్లు వసూలు చేశారన్న నెపంతో విద్యార్థుల విలువైన సమాయాన్ని వృధా చేయడంతో పాటు ఉపాధ్యాయులను బయ బ్రాంతులకు గురి చేసిన డిఇఒ తిరుమల చైతన్యను వెంటనే ప్రభుత్వం సస్పెండ్ చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి, ఎడ్యుకేషన్ సబ్‌కమిటీ కన్వీనర్ గొంటి గిరిధర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలువైన సమయాన్ని వృధా చేసి కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఐదుగురు విద్యార్థుల లోదుస్తుల్లో స్లిప్పులు ఉన్నాయని నమ్మబలికి డిబార్ చేయడంతో పాటు ఉపాధ్యాయులను బలి చేయడం ఉద్దేశ్య పూర్వకమేనని ఆరోపించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.లక్షలు చేతులు మారాయని నేరపూరిత కుట్ర బయట పెట్టానని అబద్ధాలు ప్రచారం చేయడం డిఇఒకు తగదన్నారు. విద్యాశాఖను అబాసుపాలు చేయాలన్న ఆయన ఉద్దేశాన్ని అధికారులు గుర్తించాలన్నారు. ఆయన డైట్ ప్రిన్సిపాల్‌గా, డిఇఒగా, ఆర్‌విఎం ఎపిసిగా అదనపు బాధ్యతల్లో ఉన్న సమయంలో జరిగిన అక్రమాలపై విచారణ జరపించాలని కోరారు.

అరసవల్లి హుండీ ఆదాయం లెక్కింపు

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఐదు హుండీలను గురువారం లెక్కించారు. వీటిలో కరెన్సీ నోట్లు రూపేణా రూ. 7,15,780, చిల్లర నాణేలు రూ. 81,885 వచ్చాయి. ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారి ప్రసాద్ పట్నాయక్ పర్యవేక్షణలో వాటిని లెక్కించారు. విదేశీ కరెన్సీతో పాటు యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు చెందిర మూడు డాలర్లు, బ్యాంక్ ఆఫ్ కెనడా 5 డాలర్లు వచ్చాయని ఇఒ వై.భద్రాజీ తెలిపారు. ఆమదాలవలస గ్రూప్ దేవాలయాల కార్యనిర్వాహణాధికారి తమ్మినేని రవి, ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయ ఇఒ సుఖన్య తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగురాలిపై అత్యాచారయత్నం

సోంపేట మండలంలోని బేసిరామచంద్రపురానికి చెందిన 24 ఏళ్ల మానసిక వికలాంగురాలిపై అదే గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ అత్యాచారానికి ప్రయత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ మేరకు బారువ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మానసిక వికలాంగురాలు తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉంది. అదే గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ ఆమెపై ఏడు నెలల క్రితం అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. అది గమనించిన తల్లిదండ్రులు అతడిని వారించి, పెద్ద మనుషులకు తెలియజేశారు. బుద్ధి చెప్పడంతో ఇకపై తన కూతురు జోలికి రారనుకొని తల్లిదండ్రులు ఊరుకున్నారు. అయితే గత సోమవారం వికలాంగురాలు ఇంటి నుంచి సమీపంలోని బాత్‌రూమ్ స్నానం చేసేందుకు వెళ్తుంది. మరోసారి ఆమె అత్యాచార యత్నానికి ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న ఆమె తల్లి గమనించి కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. సంఘటనపై పెద్దలకు తెలియజేసి వారి సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గంజాయితో మహిళ అరెస్టు

ఇచ్ఛాపురం : ఒడిశా నుంచి 10.3 కేజీల గంజాయిని అక్రమంగా తరలిస్తున్న మహిళను గురువారం అరెస్టు చేశామని మొబైల్ ఎక్సైజ్ సిఐ జి.వి.రమణ తెలిపారు. ఇచ్ఛాపురం పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీ చేస్తున్నామని అన్నారు. ఈ సమయంలో రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న మహిళను తనిఖీ చేయగా గంజాయితో పట్టుబడిందన్నారు. మహిళకు సరఫరా చేసిన వ్యక్తిపైనా కేసు నమోదు చేశామన్నారు. మహిళను అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దాడుల్లో సిబ్బంది విఠలేశ్వరరావు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట

గుజరాతీపేట: నగరంలోని నదీ పరివాహక ప్రాంతాలు, నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్ నిఘా పెట్టి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అరికట్టే దిశగా చర్యలు చేపడుతున్నామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అరసవల్లి 80 అడుగుల రోడ్డు, డచ్ బంగ్లా, వాంబే కాలనీ, కొత్తపేట, నాగావళి నదీ పరివాహక ప్రాంతాలు, పట్టణ చివర ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం, పేకాట, ఈవిటీజింగ్, చైన్ స్నాచింగ్ వంటి నేరాలపై గురువారం డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టామన్నారు.

1న జాబ్‌మేళా

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఏప్రిల్ 1న టెక్కలి నియోజకవర్గం పరిధిలోని కోటబొమ్మాళిలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కోటబొమ్మాళి జూనియర్ కాలేజీ ఆవరణలో ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో 32 కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారని, 1215 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న పది, ఇంటర్మీడియట్, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బిటెక్ చదువుకున్న అర్హులైన అభ్యర్థులు వివిధ పోస్టులకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

పుష్పగుచ్ఛం అందిస్తున్న సభ్యులు

నిధుల మంజూరుపై హర్షం

ప్రజాశక్తి- కవిటి

కవిటి సముద్ర తీర మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ అభివృద్ధికి టిటిడి శ్రీవాణి ట్రస్టు నుంచి రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులు మంజూరుకు కృషి ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం ఎమ్మెల్యే అశోక్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి ముందస్తు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బి.పాపయ్యారెడ్డి, బెందాళం రమేష్, మొగలిపురి సీతారాం, ఆరింగి మధు, ఆరంగి త్రివిక్రమరావు, పొల్లాయి హిమాచలం, ఈపిరి వెంకటరమణమూర్తి, తమరాల వెంకటరమణ, బావన రవి, పొల్లాయి రుద్రయ్య, పొల్లాయి దుర్యోధన, చందాన కోదండరావు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూ

పోలాకి: మండల పరిషత్ కార్యాలయంలో బిసి కార్పొరేషన్ రుణాలు పొందేందుకు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.రవికుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్ చేసుకున్న వారు ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లావేరు : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు 2024-25 సంవత్సరానికి సంబంధించి వివిధ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ పి. వెంకట రాజు తెలిపారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో సకాలంలో తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు.

జగన్‌ను కలిసిన రాంబాబు

బూర్జ: తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆమదాలవలస మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి రాంబాబు కలిశారు. ఆమదాలవలస నియోజకవర్గంలో అనేక సమస్యలను మాజీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను ప్రజలు దృష్టికి తీసుకువెళ్లే బాధ్యత మనందరిపై ఉందని జగన్ తెలిపినట్టు రాంబాబు చెప్పారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న దళితులు

ప్రజాశక్తి- టెక్కలి

ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన పట్టాలను మంజూరు చేయాలని మండలంలోని మునసబుపేటకు చెందిన దళితులు కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ ప్రస్తుతం తామంతా లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆధీనంలో ఉన్న స్థలంలో జీవిస్తున్నామని అన్నారు. దేవాదాయశాఖ అధికారులు ఖాళీ చేయమని చెప్పితే రోడ్డున పడతామని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తమ గ్రామానికి సమీపంలో ఉన్న పోరంబోకు స్థలంలో తమకు ఇళ్ల నిర్మాణాలకు అనుమతి మంజూరు చేసి పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకరరావు, దువ్వాడ మోహిణి, పందిరి రమ్యకృష్ణ, కురమాన పావణి పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

పొందూరు: మేజర్ పంచాయతీ పొందూరు పరిధిలోని సాయిబుల కాలనీ, కుమ్మర్ల కాలనీ, తాపీమేస్త్రి కాలనీలకు గురువారం పంచాయతీ ఇఒ కింతలి మోహన్‌బాబు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారు. ఈ కాలనీలకు తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్‌లు మరమ్మతులకు గురికావడంతో తాగునీరు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో కాలనీవాసులకు తాగునీరు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందజేశారు. అనంతరం పాడైన తాగునీటి పైప్‌లైన్లకు సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. వేసవి నేపథ్యంలో తాగునీరు ఇబ్బంది లేకుండా ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేయడంపై కాలనీవాసులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ట్యాంకర్ ద్వారా తాగునీరు అందజేస్తున్న అధికారులు

ఆర్థికంగా బలోపేతం కావాలి

మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండల సమైక్యలో గ్రామ సంఘాల నుంచి అంతర్గత అప్పులు, స్త్రీనిధి, ఉన్నతి, సిఐఎఫ్ రుణాలు తీసుకొని వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని స్త్రీనిధి ఎజిఎం ప్రత్యేకాధికారి కె.సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల మహిళా సమైక్య భవనంలో మహిళా సంఘాలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 1348 స్వయం సహాయ సంఘాలు ఉన్నాయని అన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థతో ఆనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎపిఎం ఎస్.ప్రసాదరావు, స్త్రీనిధి మేనేజర్ కె.రాము, సిసిలు మోహనరావు, లక్ష్మి, అకౌంటెంట్ మోహిని, విష్ణు, విఒఎలు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

నౌపడ : మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని టెక్కలి రూరల్ సిఐ కె.శ్రీనివాసరావు అన్నారు. సంతబొమ్మాళి మండలం యామలపేటలో సంకల్పం-2 కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా ఆశ చూపి డబ్బులు వసూలు చేస్తారని, వారి నుంచి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే ఆన్‌లైన్ మోసాలు, హని ట్రాప్, తెలియని లింకులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్ జోలికి పోకుండా నియంత్రించుకోవాలని సూచించారు. ఎవరైనా అనుకోకుండా ఆన్‌లైన్ మోసాలకు చిక్కుకుంటే ధైర్యంగా స్థానిక పోలీసులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో నౌపడ ఎస్ఐ నారాయణస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ శ్రీనివాసరావు

బార్ అసోసియేషన్ల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- గుజరాతీపేట

స్థానిక జిల్లా కోర్టులో గురువారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. న్యాయవాదులు అధికసంఖ్యలో హాజరై తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ముగ్గురు అభ్యర్థులు పోటీ చేయగా తంగి శివప్రసాద్ 127 ఓట్లతో గెలుపొందారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఇప్పిలి సీతరాజు, ప్రధాన కార్యదర్శిగా పిట్ట దామోదర్ యాదవ్, ఉమెన్ రిప్రజెంటేటివ్‌గా గురుగుబెల్లి వనజాక్షి, సెక్రటరీగా మోటూరి భవాని ప్రసాద్, ట్రెజరర్‌గా కొమర శంకరరావు, లైబ్రరీ సెక్రటరీగా కొమ్ము రమణమూర్తి, స్పోర్ట్స్ సెక్రటరీగా త్రిపురాణ వరప్రసాదరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు.

శివప్రసాద్

పలాస : ఎన్నికైన నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులు

పలాస : పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ప్రస్తుత అధ్యక్షులు ఎన్.విశ్వేశ్వరరావు, సీనియర్ న్యాయవాది పైల రాజరత్నం నాయుడు అధ్యక్షతన బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షునిగా మహమ్మద్ ఫయాజ్ అహ్మద్ (ఘని), ఉపాధ్యక్షునిగా బి.కామేశ్వర పట్నాయక్, సెక్రటరీగా బెండి కాళిదాస్, జాయింట్ సెక్రటరీగా జి.ఎం.ఎస్.అనిల్‌రాజ్, ట్రెజరర్‌గా వి.రవికుమార్, లైబ్రేరియన్ సెక్రెటరీగా కోత రజినీకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పి.ఎల్.నారాయణ, పిండి వెంకటరావు, లక్కోజి, చంద్రశేఖరరావు, తాంత్ర మురళి, నాగు, శ్యామ్‌ప్రభాకర్, హేమకుమార్, రవి, చిట్టిబాబు, తేజేశ్వరరావు, దేవరాజు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా శైలేంద్ర

శైలేంద్ర

సోంపేట : సోంపేట బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా సీనియర్ న్యాయవాది జి.ఎస్.శై లేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. స్థానిక కోర్టుల సముదాయం వద్ద గురువారం నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతంగా సాగా యి. ఉపాధ్యక్షునిగా ఎస్.భాస్కరరావు, కార్యదర్శిగా వి.గోపి, సంయుక్త కార్యదర్శిగా దున్న జాగారావు, కోశాధికారిగా బి.ధర్మారావు ఎన్నికయ్యారు.

తప్పు చేస్తే ఉపేక్షించేది లేదు

డ్వామా పీడీ సుధాకరరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఉపాధి హామీలో విధులు నిర్వహించను సిబ్బంది తప్పు చేస్తే క్షమించేది లేదని డ్వామా జీడీ బి.సుధాకరరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో గురువారం ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు రూ.17.14 కోట్లతో కూలీల పనులు నిధులు ఖర్చు చేశారని అన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే దానిపై దర్యాప్తు చర్యలు తీసుకుంటామని అన్నారు. సోషల్ ఆడిట్ సిబ్బంది తనిఖీలో రూ.6.90 లక్షలు బొప్పాయిపురం, పాతనౌపడ, బూర్గం పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేయాల్సి ఉందన్నారు. బొప్పాయిపురం, బూర్గాం గ్రామ పంచాయతీల్లో హాజరు పట్టికలో దిద్దిబాటు చేపట్టారని, వాటిపైనే చర్యలు తీసుకుంటామని అన్నారు. మండలంలో ఎక్కడా మొక్కలు కనిపించడంలేదని సోషల్ ఆడిట్ సిబ్బంది తెలిపారని, దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిఎఒ స్వరూపరాణి, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయ్, రాధమ్మ, స్వరూపరాణి, ఎంపిపి అట్లా సరోజనమ్మ, బగాది ప్రసాదరావు, ఎస్.ఎల్.నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆశ్రా ప్రతినిధులు

హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

వినియోగదారులకు హక్కులపై అవగాహన అవసరమని జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పరుశరామయ్య అన్నారు. గురువారం మండలంలోని వెన్నెలవలస జవహర్ నవోదయలో వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆశ్రా జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా మాట్లాడుతూ ఆశ్రా సంస్థ ద్వారా జిల్లాలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు మోసపోకుండా ఉండడానికి తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. వినియోగదారుడు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుపైన కొన్ని హక్కులు ఉంటాయని, ఆ విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలని సూచించారు. ఇటీవల పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తం కావాలన్నారు. సైబర్ క్రైమ్ వలలో చిక్కుకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ ఎస్.విశ్వేశ్వర రావు, డ్రగ్స్ కంట్రోల్ శ్రీనివాస్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వెంకట్ రత్నం, సివిల్ సప్లయి అధికారి రమణ, ఎస్ఐ బి.హైమావతి పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గేదల ఇందిరా ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఆనంద్ గజపతిరావు, కార్యవర్గసభ్యులు కట్టా పార్థసారధి, బాలకృష్ణ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో కార్మికులకు భద్రతా చర్యలు

శ్రీకాకుళం అర్బన్ : పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని కార్మికశాఖ ఉప కమిషనర్ అజయ్ కార్తికేయ ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, దీనివల్ల వడగాల్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిస్తోందని గుర్తుచేశారు. అందువల్ల దుకాణాలు, సంస్థలు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, వలస కార్మికుల రక్షణకు యజమానులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. అలాగే వివిధ పరిశ్రమలు, సంస్థలు, కర్మాగారాలు, వర్క్‌షాప్స్, ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులపై ఎండ తీవ్రత ప్రతికూల ప్రభావం పడకుండా యజమాన్యం తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 వరకు కార్మికులను పనికి దూరంగా ఉంచాలన్నారు. ఎండతీవ్రత తక్కువగా ఉన్న సమయాల్లో పనులు చేయాలని సూచించారు. పనిప్రదేశాల్లో నీడ, తాగునీరు, అవసరమైన మందులు, ఒఆర్ఎస్ సిద్ధంగా ఉంచాలన్నారు. కేంద్ర కార్మిక ఉపాధిశాఖ నుంచి ఆదేశాలు విడుదలయ్యాయని ఆయన వివరించారు.

కార్యకర్తలకు గుర్తింపు కార్డు

లావేరు : ప్రతి కార్యకర్తకు టిడిపి గుర్తింపు కార్డు అందించడం జరుగుతుందని ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి యినపకుర్తి తోటయ్యదొర అన్నారు. మండలంలోని టిడిపి సభ్యత్వం నమోదు చేసుకున్న వారికి గుర్తింపు కార్డులతో పాటు ప్రమాద బీమా వర్తించే అవకాశాన్ని పార్టీ కల్పించిందన్నారు. వీటిని గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా లావేరు, అప్పాపురం, వెంకటాపురం, గోవిందపురం, పెదలింగాలవలస, పోతయ్యవలస, అదపాక, గుర్రాలపాళెం, గ్రామాల్లో ఈ కార్డులు అందజేసినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి

పక్కాగా సర్వే

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలు పక్కాగా చేపట్టాలని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో గురువారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలు ప్రతి లబ్ధిదారుడికీ చేరాలని, అందులో భాగంగానే సుమారు 17 రకాల సర్వేలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ కార్యదర్శులు సర్వేలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు పక్కాగా రూపొందించాలని తెలిపారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రహి, ఇఒ వీరభద్రస్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రపూర్ణ చౌదరి

రుణాలు సకాలంలో చెల్లించాలి

రణస్థలం రూరల్: రుణాలు సకాలంలో చెల్లించాలని సంఘం అభివృద్ధికి సహకరించాలని రైతుసేవా సహకార సంఘం మేనేజింగ్ డైరెక్టర్ స్పందన ప్రపూర్ణ చౌదరి అన్నారు. పర్సన్ ఇన్‌ఛార్జి ఎం.చంటి బాబు అధ్యక్షతన గురువారం 2024-25 అర్ధసంవత్సర 67వ సాధారణ మహా జనసభ సమావేశం సంఘ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘంలో వ్యవసాయ, వ్యాపార ఆర్థిక పురోభివృద్ధికి తగు ప్రణాళిక రచించిన వాటిని అమలు జరుపుటకు సభ్యుల సలహాలు, సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 2024 నుంచి ఫిబ్రవరి 2025 వరకు సంఘంలో జరిగిన ఆర్థిక లావాదేవీలు, జమా ఖర్చులను సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ సతీష్, సంఘం ప్రతినిధులు పిసిని సూర్యనారాయణ, బొంతు శ్రీధర్, పైడి శ్రీనివాసరావు, ఎన్.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్రీగౌరి

ఎన్యుమరేటర్లను ఎంపిక చేయాలి

లావేరు: స్వయంశక్తి సంఘాల్లోని క్రెడిట్ జీవనోపాధుల ప్రణాళికలను తయారు చేసుకోవడానికి సంఘాల్లోని విద్యావంతులను ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీగౌరీ అన్నారు. గురువారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నాలుగు రోజులు పాటు నాలుగు బ్యాచ్‌లకు క్రెడిట్ జీవనోపాధుల ప్రణాళికలు తయారుకు ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేసేందుకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సంఘాల నుంచి విద్యావంతులు, సంఘాలపై అవగాహన, సేవాభావంతో ఉన్న వారిని ఎంపిక చేయాలన్నారు. వారికి యాప్ వినియోగంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వెలుగు జిల్లా ఉన్నతి ప్రాజెక్టు మేనేజర్ బి.వి.సుబ్బయ్య నాయుడు మాట్లాడుతూ ప్రతి సంఘానికి జియో స్కేనింగ్ చేసి సెర్ప్ ఆదేశాల మేరకు సభ్యులకు ఫేస్ యాప్‌లో నమోదు చేసి ప్రతి సంఘ సభ్యులు కుటుంబ ప్రస్తుత ఆదాయం గుర్తిస్తూ వచ్చే ఆర్థిక సంవత్సరంలో వారికి ఎంత ఋణం కావాలో నిర్ధారించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు వై.మల్లేశ్వరి, ఎల్. చిన్నమ్మడు, సిసిలు, విఒఎలు శ్రీదేవి, మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అపరాల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామకృష్ణనాయుడు

అపరాల కొనుగోలు కేంద్రం ప్రారంభం

బూర్జ: మండలం పెద్దపేట రైతుసేవా కేంద్రంలో ఎపి మార్క్‌ఫెడ్ ద్వారా అపరాల కొనుగోలు కేంద్రాన్ని ఎపి మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణం నాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పెద్దపేట రైతుసేవా కేంద్రంలో మొదటిసారిగా మినుములు, పెసలు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. మద్దతు ధరకే అపరాల పంటలైన మినుము క్వింటాకు రూ.7,400, పెసలు రూ.8,682కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలుకే పెసలు, మినుములు కొనుగోలు చేస్తారన్నారు. దళారులను నమ్మి తక్కువ ధరలకు విక్రయించి రైతులు నష్టపోరాదని సూచించారు. జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా గోదాములను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ ఫెడ్ డిఎం కెవిపి రమణి, వ్యవసాయ శాఖ ఎడి రాజగోపాల్, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, నీటిసంఘ అధ్యక్షులు కడగల కృష్ణ, డైరెక్టర్ అప్పల నాయుడు, రైతుసేవా కేంద్రం సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

టెక్కలి : వయోవృద్ధులు, పెన్షనర్లు కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను వినియోగించుకుంటూ మెయింటెన్స్ చట్టంపై అవగాహన చేసుకోవాలని వికలాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె.కవిత అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు అధ్యక్షతన గురువారం వయోవృద్ధులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు విశ్రాంత ఉద్యోగులు అడిగిన ప్రశ్నలకు సందేహాలకు సమాధానం ఇచ్చారు. 300 మంది సీనియర్ సిటిజన్లకు ఐడి కార్డులను అందజేశారు. ఈ సదస్సులో భాగంగా కవితకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు సంఘ కార్యదర్శి ధనుంజయరావు, బొడ్డ అయ్యబాబు, పి.హరిశ్చంద్రరావు పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది సంబరాలు

నందిగాం : మండలంలోని పెద్దతామరపల్లిలో కాపు సంక్షేమ సంఘం టెక్కలి నియోజకవర్గం ఆధ్వర్యాన గురువారం ముందస్తు ఉగాది సంబరాలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గస్థాయిలో లేక దోడల పోటీలు నిర్వహించారు. బలిష్టంగా ఉన్న లేగ దూడలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఆర్.చిన్నంనాయుడు, పోలాకి చంద్రశేఖరరావు, పోలాకి వాసు, టి.మహేష్, టి.దేవేంద్రరావు టి.బాలరాం పాల్గొన్నారు.

'ఐపిఆర్'పై అవగాహనతో మరింత ప్రగతి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మేధో సంపత్తి హక్కులు (ఐపిఆర్)పై సరైన అవగాహన, లోతైన విజ్ఞానం కలిగి ఉంటే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నడిపేవారు తమ రంగంలో మరింతగా ప్రగతి సాధించవచ్చునని వక్తలు అభిప్రాయపడ్డారు. ఎపి మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎం.ఎస్.ఎం.ఇ.) డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎం.ఎస్.ఎం.ఇ, జిల్లా పరిశ్రమల కేంద్రం, డా. బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఆర్ అండ్ డి, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాలు సంయుక్తంగా గురువారం ఐపిఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని వర్సిటీలో నిర్వహించాయి. హాజరైన సంబంధిత పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, స్టార్టప్ ఆవిష్కర్తలు, అధ్యాపకులు విద్యార్థులనుద్దేశించి వక్తలు మాట్లాడారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న జిల్లా పరిశ్రమల శాఖ (డిఐసి) జనరల్ మేనేజర్ జి.ఎం.శ్రీధర్ మాట్లాడుతూ నూతన పారిశ్రామిక విధానాలతో ఎంఎస్ఎంఇల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రైజింగ్ అండ్ ఎక్స్‌లరేటింగ్ ఎంఎస్ఎంఇ పెర్ఫార్మెన్స్ (రాంప్) పథకం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా ఐపిఆర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాపీరైట్లు, పేటెంట్లు, ట్రేడ్, బ్రాండ్ మార్కులు వంటివాటిపై పూర్తిస్థాయిలో శిక్షణ కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత మాట్లాడుతూ ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్ సెంటర్ల ద్వారా ఆవిష్కరించబడే నూతన ఆలోచనలకు పేటెంట్, డిజైన్లు వంటివి తోడైతే ఆ ఆవిష్కరణలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. స్థానికంగా ఉన్న ఎంఎస్ఎంఇలు, జిల్లా పరిశ్రమల శాఖతో కలిసి పనిచేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని సూచించారు.

మాట్లాడుతున్న సుజాత

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఇ సిఇఒ డా.జి.సుదర్శన్, నొవెల్ పేటెంట్ సర్వీసెస్ ప్రతినిధి రాజు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌డిఎం సూర్యకిరణ్, ఎపిఎస్ఎఫ్‌సి బ్రాంచి మేనేజర్ జి.రవికుమార్, వర్సిటీ ఆర్‌అండ్‌డి డీన్ డా. ఎన్.లోకేశ్వరి, డా. టి.సంతోష పావని, డా. ఎన్.మధులత తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డా. కె.కరుణానిధి, రీసెర్చ్ ఫోరమ్ కన్వీనర్ డా. ఎస్.సంతోష్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు తెరవే ఉగాది స్వాగత సమ్మేళనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఈనెల 29న సాయంత్రం 4 గంటలకు స్థానిక శాంతినికేతన్ కళాశాలలో విశ్వావసు నామ ఉగాది స్వాగత సమ్మేళనం జరుగుతుందని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి యు.నాగేశ్వరరావు అధ్యక్షత వహిస్తారని, సమన్వయకర్తగా కోనే శ్రీధర్ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా సెట్ శ్రీ పూర్వపు సిఇఒ సురంగి మోహనరావు, డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గుంట లీలా వరప్రసాదరావు, విశ్రాంత ఉపవిద్యాశాఖాధికారులు ఇసాయి వెంకటరావు, మహేష్ చంద్రసామంత్ పాల్గొంటారన్నారు. కిమ్మి సంతోష్ కుమార్ ఆధ్వర్యాన సాంస్కృతిక కార్యక్రమాలు, స్వీయ కవితా పఠనం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దివంగత రచయిత డాక్టర్ బి.ఎస్.ప్రసాద్ రాసిన 'వెన్నెల వెలుగులు' అనే సాహిత్య పుస్తకాలను అందజేస్తా మన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- అరసవల్లి

రంజాన్ నెల పురస్కరించుకొని ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా ఈ మాసాన్ని జరుపుకుంటారని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ముస్లింల నమాజ్, ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న అధికారులు

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రైతుల నిబంధనలను పాటించాలని తహశీల్దార్ బడే పాపారావు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో సుందరాడ, మాకనపల్లి రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. సాగునీటి సమస్య రెండు గ్రామస్తులపై వివాదం నెలకొనడంతో అధికారులు రైతులను సమన్వయం చేసేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. రాళ్లబంద చెరువులో మదుమస్థాయిలోని సాగునీటినీ వినియోగించుకోవాలని, ఇంజిన్ల ద్వారా నీటిని వినియోగించుకోకూడదని ఇరిగేషన్ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్‌పండా ఎస్ఐపి రమేష్‌బాబు, ఇరిగేషన్ జెఇ వెంకటరమణ, డిటి రాము, ఎఒ దానకర్ణుడు, సీనియర్ అసిస్టెంట్ జగన్మోహన రావు, మండల సర్వేయరు శ్యామలరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

కవిటి: మండలంలోని గొర్లెపాడు ఎంపియుపి పాఠశాలలో చదువుతున్న పైల హర్షవర్ధన్‌రెడ్డి, పైల హరీష్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఆకాంక్షించారు. ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన పెన్కాక్ సిలాట్ ఛాంపియన్ షిప్-2025 పోటీల్లో వీరు బంగారు పతకాలను సాధించారు. ఈ సందర్భంగా రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం రాత్రి విప్‌ను కలిశారు. అనంతరం మాట్లాడుతూ వివిధ రకాల స్వీయ రక్షణ, మానసిక స్ఫూర్తి, కళలు, సంస్కృతికి సంబంధించిన పెన్కాక్ సిలాట్ పోటీలు విద్యార్థుల్లో మానసిక ధైర్యంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. అలాగే వీరికి శిక్షణ ఇచ్చిన సోంపేటకు చెందిన ఎస్కే మార్షల్ ఆర్ట్స్ సిబ్బందిని అభినందించారు. ఎంఇఒ ధనుంజయ మజ్జి, తమరాల వెంకటరమణ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు శిక్షణ

అరసవల్లి: అంగన్వాడీలను అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రాజెక్ట్ అధికారి జి.శోభారాణి అన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలకు పోషన్ బి పడాయి బి శిక్షణను గురువారం ఆమె జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీలో చదువుతున్న చిన్నారులకు పోషకాహారం అందించడంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. చిన్నారుల్లో విద్యను అభివృద్ధి చెందే విధంగా బోధనా పద్ధతులు అందించడం, అవసరమైన బోధనా ఉపకరణాలపై కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ శిక్షణా తరగతులు ఈనెల 29 వరకు నిర్వహించ నున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పి.సీతామహాలక్ష్మి, కళ్యాణి, యశోద, కె.ఉమ, బి.యోగేశ్వరి, గజలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యాప్‌లపై అవగాహన

కోటబొమ్మాళి: యాప్‌ల వినియోగంపై మహిళ సంఘాలు అవగాహన పెంచుకోవాలని జిల్లా వెలుగు ప్రాజెక్టు బ్యాంకు లింకేజి డిపిఎం ఎ.నాగలక్ష్మి అన్నారు. సిఇఒ ఆదేశాలు మేరకు స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా స్వయం శక్తి సభ్యులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025-26 వార్షిక క్రెడిట్, జీవనోపాధుల ప్రణాళికలు తయారు చేయడానికి ప్రతి ఆరు సంఘాల్లో ఒక విద్యావంతులు, సేవాభావం ఉన్న వారిని ఎన్యుమరేటర్ గుర్తించి వారికి యాప్‌ల వినియోగంపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో వెలుగు ఎపి ఎస్.శ్రీరాములు, ఎపిఎం శ్రీనివాసరావు, మండల మహిళ సమాఖ్య అధ్యక్షులు మెండ సుశీల, మెట్ట రమణమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎచ్చెర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆయనపై ఏదోరకంగా బురదజల్లేందుకు చవకబారు ప్రయత్నం చేస్తున్నారని ఎచ్చెర్ల నియోజకవర్గం కూటమి నాయకులు ముప్పిడి సురేష్, బెండు మల్లేశ్వరరావు, కుమరాపు రవికుమార్, లుకలాపు అప్పలనాయుడు, అన్నెపు భువనేశ్వరరావు, పిసిని జగన్నాథంనాయుడు అన్నారు. మండల కేంద్రంలో టిడిపి కార్యాలయం వద్ద గురువారం నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాసనసభ సమావేశాలు ముగిసిన తర్వాత సాంప్రదాయం ప్రకారం ఆనవాయితీగా ఎమ్మెల్యేలతో క్రీడాపోటీలు, పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా ప్రతి ఒక్క ఎమ్మెల్యే రకరకాల స్కిట్‌లు చేశారని తమ ఎమ్మెల్యే ఎన్ఇఆర్ చేసిన స్కిట్‌లో 11 అనే నెంబర్ చెప్పగానే ఇక్కడ మాజీ ఎమ్మెల్యేతో పాటు పలువురు ఉలిక్కిపడ్డారని, పుచ్చకాయలు దొంగ అంటే భుజాలు తడుముకున్నట్టు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే తీరుందన్నారు. తన హయంలో నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు, శాసనసభలో నియోజకవర్గ సమస్యలపై ఎన్నిసార్లు ప్రస్తావించారో చర్చకు రావాలని సవాల్ విసిరారు. తోటపల్లి, మడ్డువలస, నారాయణపురం కోసం మాట్లాడారన్నారు. అదేవిధంగా పార్లమెంట్‌లో కూడా నియోజకవర్గ పరిధిలోని విషయాల్లో ఎంపీ అప్పలనాయుడు ప్రశ్నించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, నియోజకవర్గం కూటమి నాయకులు పిన్నింటి మధుబాబు, ఆకుల రవికుమార్, బాలి శ్రీను, సాయి, రవి, బిజెపి మహంతి ఆనంద్, పిసిని హరికృష్ణ, తిప్పాన బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట నిర్వహణలో జాప్యం ఎందుకు..?

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని ప్రతి గురువారం నిర్వహిస్తున్న నారాయణపురం పశువుల సంత ద్వారా పంచాయతీకు అశీల ద్వారా లక్షలాది రూపాయలు ఆదాయం తీసుకొస్తుంది. ఈ నెల 31తో వేలంపాట పూర్తి అయిపోతుంది. అయితే ఇప్పటి వరకు ఈ సంత వేలంపాటపై సంబంధిత అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో పలువురు పెదవి విరుస్తున్నారు. గతంలో వేలంపాట గడువుకు నెల ముందే నోటిఫికేషన్ విడుదల చేసి వేలం పాట నిర్వహించేవారు. గురువారంతో వేలం పాటదారుడుకి సమయం అయిపోయినా సంత వేలం పాట నిర్వహించలేదు. దీంతో వచ్చే గురువారం ఏప్రిల్ 4న మండల పరిషత్ సిబ్బందే సంతకు వెళ్లి అశీలు వసూళు చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు మండల పరిషత్ సిబ్బంది సంతలో అశీలు వసూళ్లు చేస్తే వారానికి రూ.50 వేలుకు మించి ప్రభుత్వానికి ఆదాయం

నారాయణవలస సంత

వచ్చేదికాదని, అదే వేలం పాట నిర్వహిస్తే, పాటదారుడు ద్వారా ప్రభుత్వానికి వారానికి రూ.లక్ష నుంచి రూ.లక్షనర వరకు ఆదాయం వస్తుంది. ఈ విషయం అధికారులకు తెలిసినా వేలంపాట నిర్వహించటంలో జాప్యం ఎందుకు చేస్తున్నారో? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వెంటనే నారాయణవలస పశువుల సంతకు వేలంపాట నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

కాలనీల్లో మెరుగైన వసతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని విశాఖ ఎ కాలనీలో ఉన్న వివిధ కాలనీల్లో డ్రైనేజీలు, సిసి రోడ్లు ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారు. గురువారం ప్రధానంగా కాలనీల్లో మురుగునీరు వెళ్లే మిర్తి బట్టి కాల్వను పరిశీలించిన ఆయన కాలనీలో ప్రతి సిమెంట్ రోడ్డుకు కాల్వలను అనుసంధానానికి అవసరమైన చర్యలు తీసుకుంటానన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ సిమెంట్ రోడ్లు నిర్మాణం కాలేదని, కొన్నిచోట్ల రోడ్లు పాడైపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆయనకు వివరించారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సమస్యలపై పలువురు ఫిర్యాదు చేశారు. తాగునీటి సరఫరాలో సమయపాలన లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మురుగునీటి కాల్వగా మారిన మిర్తిబట్టిని ఆధునీకరించడానికి ముందుగా ఆక్రమణలు తొలగించాలని, వర్షాకాలంలో ఈ ఆక్రమణ వల్ల మురుగునీరు కాల్వల్లో ప్రవహించేందుకు వీలులేక కాలనీల్లోకి వచ్చి చేరుతోందన్నారు. దీనివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆయనకు వివరించారు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారం చూపుతానని మామీఇచ్చారు. ఆయనతో పాటు మాజీ ఎంపిటిసి ముద్దాడ రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి వరం

ప్రజాశక్తి- పోలాకి

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చికిత్స చేయించుకోవడానికి రూ.2.56 లక్షలతో సిఎం సహాయనిధి రెండు చెక్కులను కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు గురువారం అందజేశారు. మండలంలోని వనిత మండలం గ్రామం కడగల సూర్యనారాయణకు బ్రెయిన్ సర్జరీ కోసం రూ.55,984 సిఎం సహాయనిధి నుంచి చెక్కును అందజేశారు. దీర్ఘాసికి గేదెల లక్ష్మి భర్త చెట్టుపై నుంచి పడి మృతి చెందడంతో ఆస్పత్రి ఖర్చుల కోసం రూ.2 లక్షలు సిఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, ఎంపిటిసి మాజీ సభ్యులు మెండ శ్రీనివాసరావు, కురిటి ఈశ్వరరావు, ఎన్ని రమేష్ పాల్గొన్నారు.

పోలాకి : చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

కొత్తూరు : మండలంలోని సిరుసువాడకు చెందిన కొవ్వాడ శ్రీరాములు బ్రెయిన్ డైలాసిస్‌తో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. సిఎం సహాయ నిధి నుంచి రూ. 1,13,808 మంజూరైంది. ఈ చెక్కును ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు, తహశీల్దార్ కె.రవిచంద్ర, ఎంపి డిఒ వి.నీరజ, సర్పంచ్‌లు వలరౌతు పోలి నాయుడు, లోతుగెడ్డ భగవాన్‌దాస్‌నాయుడు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని కంబాలరాయుడుపేటకు చెందిన గోవింద వేణు కొంత కాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం కోసం రూ.5 లక్షలు వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. గ్రామానికి చెందిన పింగళి వెంకన్న యూత్ సభ్యులు స్పందించి గురువారం బాధిత కుటుంబానికి రూ.15 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో పింగళి వెంకన్న యూత్ అధ్యక్షుడు ఉప్పాడ గంగాధరరావు, గౌరవాధ్యక్షులు కారి వెంకటరావు, సభ్యులు బడే ఈశ్వరరావు, కంబాల హేమసుందర్, అంబటి రవి, బడే ధనరాజ్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

కొత్తూరు: మండలంలోని మెట్టురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహించిన మినీ అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ శిక్షణలో కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాలకు చెందిన మినీ అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ లింగాల శాంతకుమారి పరిరక్షణలో పోషణ బి పడాయి బి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో చిన్నారుల విద్యాభ్యాసన, పౌష్టికాహారం పంపిణీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుధవని, గౌశ్యబేగం, ఈశ్వరమ్మ, భవానీ, సరస్వతి, సాయికుమారి, లక్ష్మి, జ్యోతి, నవభారతి, టీచర్లు వరదరాజులు, యుడిసి జగన్నాథం పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న అంగన్వాడీలు

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

టెక్కలి : స్థానిక ఎంజెపిఎపిబిసిడబ్ల్యు బాలికల పాఠశాలల్లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నామని టెక్కలి సినియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం అనే అంశంపై ఈ సదస్సు నిర్వహించనున్నామన్నారు. ఈ సదస్సులో విద్యార్థులు పాల్గొని వినియోగించుకోవాలని కోరారు.

నేడు వేలంపాట

టెక్కలి రూరల్ : టెక్కలి మేజరు పంచాయతీ ఆశీలు పాటలు శుక్రవారం నిర్వహించనున్నట్టు ఇన్‌ఛార్జి కార్యనిర్వహణ అధికారి శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ రోజువారి, కబేళా, సంత ఆశీలు వసూలు చేసేందుకు వేలంపాట నిర్వహించనున్నారని తెలిపారు. ఆసక్తి ఉన్న రూ.లక్ష విలువ చేసే సాల్వెన్సీ నోట, రూ.లక్ష నగదు డిపాజిట్ చేయాలన్నారు.

బస్ షెల్టర్ నిర్మించాలి

సోంపేట : మండలంలోని కొర్లాం జాతీయ రహదారి వద్ద ఫ్లై ఓవర్‌పై బస్సు షెల్టర్లు నిర్మించాలని సర్పంచ్ ప్రతినిధి రామ్ బుడ్డి గణపతి కోరారు. ఈ మేరకు జాతీయ రహదారుల అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ రంజన్‌ను విశాఖపట్నంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. బస్సు షెల్టర్ల లేకపోవడంతో ఫ్లైఓవర్‌కు ఆనుకొని ఉన్న ఫుట్‌పాత్‌లను సిసి రోడ్లుగా నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. వీటికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఇంటి పన్ను బకాయిలు ఉన్న పట్టణ ప్రజలు సకాలంలో చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరినట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పన్ను బకాయిల వడ్డీలో 50 శాతం మాఫీ చేయడం జరిగిందని, అలాగే గతంలో ఇంటి పన్ను వడ్డీతో సహ చెల్లించిన వారికి కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు 50 శాతం వడ్డీ మాఫీ వర్తింపజేసి తరువాత చెల్లించే ఇంటి పన్నులో మినహాయింపు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని మార్చి 31 లోగా పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంత వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

సంత ఆశీలు వేలంపాట ఖరారు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని 7వ వార్డు పరిధిలోని చింతాడ సంతకు నిర్వహించిన ఆశీల వేలంపాట ఎట్టకేలకు ఖరారైంది. గురువారం పురపాలక సంఘ కార్యాలయంలో మేనేజర్ బిషోయ్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి చింతాడ సంత వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో ఇద్దరు పాటదారులు బోర హరనాథ్, బోర భారతి పాల్గొన్నారు. సర్కారు వారి పాట రూ.7, 23,753 ప్రారంభం కాగా బోర భారతి ఏడు లక్షల అరవై రెండు వేలకు పాటను కైవసం చేసుకున్నారు. దీనికి అదనంగా రూ.లక్ష స్వీపర్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తమ్మినేని గోవిందరావు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ విభాగ సీనియర్ అసిస్టెంట్ జామి శ్రీనివాసరావు, పురపాలక సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు

నిధుల మంజూరుపై హర్షం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలో 43 పంచాయతీల్లో ఉన్న అధ్వాన రహదారులకు రూ.20 కోట్లు మంజూరు చేయడం వైస్ ఎంపిపి తులసీవరప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు టిడిపి నాయకులతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. రోడ్ల నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నిధులు మంజూరుకు కృషి చేశారని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిరుసువాడ, లోతుగడ్డ, కుంటిభద్ర గ్రామాలకు ఉపాధి హామీ ద్వారా రూ.2 కోట్లు మంజూరయ్యాయని అన్నారు. మూడు దశాబ్దాలుగా ఆ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గత ఎన్నికల్లో ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేశారని అన్నారు. సమావేశంలో టిడిపి మండల నాయుకులు లోతుగెడ్డ లక్ష్మీనారాయణ నాయుడు, కోయిలాపు సంజీవరావు, రేగేటి కన్నయ్యస్వామి, సర్పంచ్‌లు వలురౌతు పోలినాయుడు, సనపల కోటీశ్వరరావు, ఎంపిటిసి ప్రతినిధి బి.సంజీవరావు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

స్వయం సహాయక సభ్యులు జీవనోపాధుల ప్రణాళికలు సిద్ధం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎపిఎం గొడబ ప్రసాదరావు అన్నారు. మండల మహిళా సమాఖ్య భవన్‌లో స్వయం సహాయక సభ్యులకు అప్పులు, జీవనోపాధుల ప్రణాళికలపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవనోపాధుల ప్రణాళికలు తయారు చేయడానికి మొబైల్ యాప్‌లను అందజేస్తామని అన్నారు. కుటుంబ అవసరాలకు సంబంధించి పెట్టుబడి రుణ వివరాలు మొబైల్ యాప్ ద్వారా ఎన్యూమరేటర్లు అవగాహన కలిగిస్తామన్నారు. మహిళా సంఘాలు బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు సరస్వతి, కోశాధికారి చంద్రకళ, సిసిలు హరిప్రియ, రేణుక, నీలవేణి, వెంకటరావు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మి పరామర్శ

ఇచ్ఛాపురం : వైసిపి కో-ఆర్డినేటర్, విజయనగరం జెడ్‌పి చైర్మన్ చిన్న శ్రీను రెండో కుమారుడు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి గురువారం విజయనగరం వెళ్లి శ్రీనును పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, పిలక సంతోష్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వం కేటాయించే విశిష్ట సంఖ్యతో రైతులకు కలిగే లాభాలు ఎఒ పిరియా శ్రీదేవి రైతులకు వివరించారు. మండలంలోని ఎర్రగోవిందపుట్టుగలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఖరీఫ్ సీజన్లో చేపట్టాల్సిన ప్రణాళికలు, రబీ పంటల స్థితిగతులు రైతులకు వివరించారు. కార్యక్రమంలో విఎఎ లోహిత్ పాల్గొన్నారు.